సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



ఆదుకుందాం రండి

విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని సైకత శిల్పి గేదెల హరికృష్ణ ఓ శిల్పాన్ని తీర్చిదిద్దారు. ఆమదాలవలస మండలం గాజుల కొల్లివలస గ్రామంలో సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద శిల్పాన్ని రూపొందించారు. – ఆమదాలవలస

వినాయక చవితి ఉత్సవాలకు 1302 దరఖాస్తులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో గణపతి నవరాత్రుల ఉత్సవాలకు సింగిల్ విండో ద్వారా అనుమతుల కోసం ఇప్పటి వరకూ 1302 దరఖాస్తులు వచ్చినట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం జరిగిన వినాయక చవితి ఉత్సవాల అనుమతులు, ముందస్తు చర్యలు, నిమజ్జనం ఏర్పాట్లపై పలాస, టెక్కలి, శ్రీకాకుళం ఆర్డీవోలు, డీఎస్పీలు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు.

11న ఎచ్చెర్ల ఐటీఐలో అప్రెంటిస్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ఈ నెల 11వ తేదీన ప్రధాన మంత్రి జాతీయ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. ఐటీఐలో గురువారం వివరాలు వెల్లడించారు. ఈ మేళాకు జిల్లాలోని అరబిందో, నాగార్జునా ఆగ్రికెం, స్మార్ట్ కెం, వరుణ్ మోటర్స్ వంటి ఆరు కంపెనీలు హాజరు కానున్నాయని తెలిపారు. ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు. చిత్రంలో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు



హాజరైన ఉపాధ్యాయులు

గురుభ్యో నమః

- సమాజంలో గౌరవ స్థానం ఉపాధ్యాయునిదే
- డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలతో ముందుకెళ్లాలి
- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు
- టీచర్స్‌డే సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రదానం

శ్రీకాకుళం క్రైమ్:

సమాజంలో గౌరవ ప్రదమైన స్థానంలో ప్రప్రథమంగా ఉండేది ఉపాధ్యాయులేనని, బోధనలో మరిన్ని మార్పులు చేసి విద్యార్థులను బలోపేతం చేయడానికి మరింత కృషి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజ రాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. టీచర్స్ డే సందర్భంగా గురువారం నగరంలోని అంబేడ్కర్ ఆడిటోరియం ఆధ్వర్యంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన డీఈఓ తిరుమల చైతన్య ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయసాధనకై ప్రతి ఒక్కరూ కృషిచేయాలని, సాధారణ విద్యార్థులను అద్భుత వ్యక్తులుగా మార్చే శక్తి ఉపాధ్యాయులకు ఉంటుందన్నారు. విద్యతో పాటు విలువలు నేర్పాలని, ఆట ల్లో ప్రావీణ్యం పెంపొందించాలని, విప్లవాత్మక మా ర్పులతో, కొత్త ఆలోచనలతో ముందుకొస్తే ప్రభుత్వం తరఫున మీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూఉపాధ్యాయుని క్రమశిక్షణతోనే విద్యా ర్థులు ఉన్నతంగా ఎదుగుతారని, చక్కని విద్యనందించిన ఉపాధ్యాయుల వలనే ఈ స్థితిలో ఉన్నానన్నారు. ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం ఒక పూట అందజేస్తున్నామన్నారు. అనంతరం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల, శ్రీకాకుళం ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వర రావులు మాట్లాడారు. డీఈఓ తిరుమల చైతన్య జిల్లాకు సంబంధించి విద్యాపరంగా సమస్యలు మంత్రికి విన్నవించారు. అనంతరం 78 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు, జ్ఞాపికలు, మొక్కలు అందజేసి.. దుశ్శాలువాలతో సత్కరించారు. అంతకుముందు డాక్టర్ నీరజా సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఏపీసీ ఆర్.జయప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో తన్మయి కూచిపూడి నృత్య అకాడమీ విద్యార్థినుల ప్రదర్శన

న్యూస్‌రీల్

నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఐటెప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం (ఐటీఈపీ)కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 13వ తేదీలోపు విద్యార్థులు వర్సిటీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఆర్‌ఏయూ.ఈడీయు.ఐఎన్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నాలుగేళ్ల డిగ్రీ కోర్సుల్లో బీఏబీఈడీలో 50 సీట్లు, బీఎస్సీ బీఈడీలో 50 సీట్లు ఉన్నాయి. ఇంటర్మీడియెట్ తర్వాత నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన ఎన్‌సీఈటీ -2024 పరీక్షలో స్కోర్ సాధించిన విద్యార్థులకు ప్రవేశాలు నిర్వహిస్తారు. గత ఏడాది ఈ కోర్సును ప్రారంభించారు. నాలుగేళ్ల డిగ్రీతో పాటు బీఎడ్ అర్హత లభిస్తుంది. మూడేళ్ల తరువాత డిగ్రీతో సైతం విద్యార్థులు రిలీవ్ కావచ్చు. ఈ డిగ్రీ చదివిన విద్యార్థులు జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి నిబంధనల మేరకు స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ రెండు ఉపాధ్యాయ పోస్టులకు అర్హత సాధిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ రిజర్వేషన్ రోస్టర్ మేరకు ప్రవేశాలు నిర్వహిస్తారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షుల నియామకం



దుంపల రామారావు (లక్ష్మణరావు) | మామిడి శ్రీకాంత్ | అంధవరపు సూరిబాబు | రాజాపు అప్పన్న | దుక్క లోకేశ్వరరెడ్డి | డి.పి దేవ్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులను నియమిస్తూ పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తాడేపల్లి కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇందులో విజయనగరం నుంచి తూర్పు కాపు అధ్యక్షులుగా మామిడి శ్రీకాంత్‌ని, శ్రీకాకుళం జిల్లా నుంచి కళింగ సామాజిక వర్గ అధ్యక్షులుగా దుంపల రామారావు (లక్ష్మణరావు), కళింగకోమటి, కళింగవైశ్య అధ్యక్షులుగా అంధవరపు సూరిబాబు, కూరాకుల, పొందర అధ్యక్షులుగా రాజాపు అప్పన్న, రెడ్డిక సామాజిక వర్గం నుంచి దుక్క లోకేశ్వరరెడ్డి, శ్రీశయన సామాజిక వర్గం నుంచి డీపీ దేవ్‌లను నియమించారు.

తీర ప్రాంత భద్రత కోసం సాగర్ కవచ్



బెండిగేటు జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తున్న మెరైన్ ఏఎస్పీ మధుసూధనరావు

వజ్రపుకొత్తూరు: తీర ప్రాంత భద్రత కోసం ఏటా సాగర్ కవచ్ నిర్వహిస్తున్నామని, దీంతో తీర ప్రాంతం గస్తీపై సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామని మెరైన్ పోలీస్ అడిషనల్ ఎస్పీ మధుసూధనరావు అన్నారు. సాగర్ కవచ్ నిర్వహిస్తున్న సందర్భంగా గురువారం మండలంలో బెండిగేటు జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలను ఆయన పరిశీలించారు. మెరైన్ సీఐ డి.రాము ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేసి రికార్డులను పరిశీంచారు. తీరం వెంబడి గుర్తు తెలియని వ్యక్తుల సంచారం, వాహనాల వినియోగం పరిశీలించాలని, అలాంటి వారు ఎవరైనా తారస పడితే వెంటనే మెరైన్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మీకోసం వినతుల స్వీకరణ రద్దు

శ్రీకాకుళం క్రైమ్ : కాశీబుగ్గ ఎస్‌హెచ్‌ఓ వద్ద నేడు జరగాల్సిన మీకోసం వినతుల స్వీకరణ రద్దు చేస్తున్నట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో తాను విధుల్లో ఉన్నందున రద్దు చేశామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

వేతనాల్లో కోత

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిబంధనలకు మించి సెలవులు తీసుకున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనంలో కోత విధించారు. కాంట్రాక్టు బోధకులకు ఏడాదిలో పనిదినాల్లో 12 సెలవులు అమలు చేస్తున్నారు. ఈ సెలవులకు మించి వాడితే వేతనంలో రోజు వారీ కోత విధిస్తున్నారు. ఈ నెలలో 11 మంది వరకు వేతన కోతకు గురయ్యారు. సెలవులు పెంచాలని, ప్రసూతి సెలవులు మహిళలకు అమలు చేయాలని అధికారులను కాంట్రాక్టు సిబ్బంది కలిశారు. పరిశీలించనున్నట్లు అధికారులు తెలిపారు.

పసుపు కండువాలు వేసేయండి సార్



పసుపు కండువాలు మా మెడలో వెయ్యండని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డికి ఇస్తున్న ప్రజాప్రతినిధులు నారాయణ స్వామి, గోపయ్య

- రసాభాసగా మారిన కవిటి మండల పరిషత్ సమావేశం
- ఎంపీడీఓ తీరుపై ప్రజా ప్రతినిధుల నిరసన

కవిటి: 'మా కారణంగా పేదల పెన్షన్‌లు తొలగించొద్దండి.. కూటమి నేతలను కలిసేందుకు ముందు మీరే మాకు పసుపు కండువాలు వేసి పార్టీలో ఆహ్వానించి మా ఒంటరి మహిళలకు పెన్షన్ అందించండి సార్' అంటూ బెజ్జిపుట్టుగ పంచాయతీ సర్పంచ్ ఎస్‌పీ నారాయణస్వామి, వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య(ఎంపీటీసీ) అన్నారు. ఎంపీపీ కడియాల పద్మ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తమ పంచాయతీ పీకేపాలెంకు చెందిన కర్రి జోగమ్మ, గండుపల్లి దేశమ్మలకు ఇస్తున్న ఒంటరి మహిళల సంక్షేమ పెన్షన్లు ఎందుకు తొలగించారని బెజ్జిపుట్టుగ సర్పంచ్ నారాయణ స్వామి, వైస్ ఎంపీపీ కర్రి గోపయ్య ప్రశ్నించారు. వారిపై వచ్చిన ఫిర్యాదు మేరకు తొలగించామని ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. తొలగిస్తే వారి పేరున నిధులు ఎందుకు విడుదలయ్యాయో వివరించాలని వారు పట్టుబట్టారు. దీంతో ఎంపీడీఓ నీళ్లు నమిలారు. అధికారులు ఇచ్చిన వివరణతో రాజీపడని ప్రజాప్రతినిధులు సభావేదిక ఎదుట బైఠాయించి నిరసనకు దిగారు. బెజ్జిపుట్టుగ ప్రజా ప్రతినిధులు కూడా ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో ఎంపీడీఓ స్పందిస్తూ.. 'మీరు ఓసారి కూటమి నాయకుల్ని కలవండి. మీ సమస్య పరిష్కారం అవుతుంది' అని వింతైన సమాధానం చెప్పారు. దీంతో ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేము కలిసే ముందు పసుపు(టీడీపీ) కండువాలు మీరే మా మెడలో వేసి పార్టీలోకి ఆహ్వానిస్తూ మా పేదలకు ఆపిన పెన్షన్లు చెల్లింపులు జరపడానికి మార్గం చూపండ'ని సభలోనే వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. దీంతో ఎమ్మెల్సీ నర్తు రామారావు కలుగజేసుకుని అధికారుల తీరును తప్పుబట్టారు. తాను ఈ సమస్యపై స్థానిక ఎమ్మెల్యే అశోక్, కలెక్టర్ దృష్టిలో పెట్టి చర్యలు తీసుకుంటానని తెలపడంతో ప్రజాప్రతినిధులు శాంతించారు. ఒక వేళ ఎక్కడా న్యాయం జరగకపోతే తాను ఆ ఇద్దరికీ పెన్షన్లు అందిస్తానని సభలో ప్రకటించారు.

హోరాహోరీగా స్టేట్ బ్యాడ్మింటన్ టోర్నీ



హోరాహోరీగా సాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలో జరుగుతున్న స్టేట్ బ్యాడ్మింటన్ టోర్నీ హోరాహోరిగా సాగుతోంది. శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీబీఏ, బాయ్ సౌజన్యంతో స్థానిక శాంతినగర్‌కాలనీలో ఉన్న డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో ఏపీ రాష్ట్రస్థాయి(అంతర్‌జిల్లా) బాల బాలికల జూనియర్స్(అండర్-19) బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2024 పోటీలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 3వ తేదీన తొలిరోజు మంగళవారం క్వాలిఫైయింగ్ రౌండ్స్ పోటీలు జరగగా.. 4వ తేదీ నుంచి మెయిన్ డ్రా పోటీలు కొనసాగుతున్నాయి. పోటీల్లో కృష్ణ, విశాఖ, తిరుపతి, కర్నూలు, ఉభయగోదావరి జిల్లాలకు చెందిన షట్లర్లు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ అన్ని విభాగాల్లోనూ సెమీఫైనల్స్ వరకు పోటీలు చేరుకున్నాయి. ఈ పోటీలు శుక్రవారం సాయంత్రంతో ముగియనున్నాయని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, సీఈఓ సంపతిరావు సూరిబాబు పేర్కొన్నారు. ఈ మెగా స్టేట్ బ్యాడ్మింటన్ టోర్నీని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.అంకమ్మ చౌదరి సారథ్యంలో బ్యాడ్మింటన్ సంఘ జిల్లా చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్, మార్ని రత్నాజీ, గురుగుబెల్లి ప్రసాద్, మదినీ శైలానీ, అనీల్, శాంతికుమార్, ఎంవీ రమణ, చీఫ్ రిఫరీ టి.కృష్ణప్రసాద్, డిప్యూటీ రిఫరీ బి.వెంకటేశ్వరరావు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.


న్యాయం చేయాలంటూ నిరసన



ప్లకార్డులతో నిరసన చేస్తున్న బాధిత వర్కర్లు

గార: ఎలాంటి కారణం లేకుండా తమను పని నుంచి తొలగించారని, తమకు పని కల్పించాలంటూ బాధిత మహిళలు నిరసన చేపట్టారు. వమరవల్లి రెసిడెన్షియల్ పాఠశాలలో రోజువారి పనిచేసే సిబ్బందిలో ఈ నెల ఒకటో తేదీ నుంచి నలుగురిని, గతంలో ఇద్దరిని నిలిపివేశారు. గురువారం వీరంతా పాఠశాల గేటు వద్ద శాంతియుతంగా నిరసన తెలిపారు. తమను తొలగించడానికి ఎలాంటి కారణాలు చూపడం లేదని, వైఎస్సార్ సీపీకి మద్దతిచ్చామన్న అసూయతోనే ఇవన్నీ చేస్తున్నారని చాట్ల లత, బెవర పుణ్యవతి, బలగ జ్యోతి, బెవర గన్నెమ్మలు ప్లకార్డులతో ఆవేదన వెళ్లగక్కారు. ఈ విషయమై సోమవారం మీ కోసంలో కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు.

సత్యం, శాంతిని బోధించాలి



హనుమంతు లజపతిరాయ్‌కు మొక్క అందిస్తున్న సత్యసాయి భక్తులు

కాశీబుగ్గ: సత్యం, శాంతి, ప్రేమ, ధర్మాలకు సంబంధించిన అంశాలను విద్యార్థులకు పాఠ్యాంశాలలో మిళితం చేసి బోధించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ సూచించారు. పలాస పట్టణంలోని సత్యసాయి మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం ఆధ్యాత్మిక ప్రసంగం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సత్యసాయి బోధనలు మానవాళి ఉన్నతికి ఎంతో ఆదర్శనీయమని అన్నారు. ఎన్ని డిగ్రీలు సాధించినా అపవిత్రమైన భావాలతో మనిషి మనుగడ సాగించలేడన్నారు. కార్యక్రమంలో సత్యసాయి మందిరం కన్వీనర్ జగదీష్, జిల్లా సాధనా శిబిరం ఇన్‌చార్జి శ్రీనివాసరావు, లొద్దబద్ర యూపీ స్కూల్ హెచ్‌ఎం గొర్లె నాగేశ్వరరావు, వివిధ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు దక్కని గౌరవం

శ్రీకాకుళం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మాత్రమే ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు ఇవ్వడం పరిపాటిగా మారిందని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ గంగు మన్మధరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో తెలిపా రు. ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా అవార్డులు ఇవ్వాలని, గతంలో ప్రభుత్వానికి కోరినా పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలందరూ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్నారని గుర్తు చేశారు.

ట్రిపుల్ ఐటీలో వైద్య శిబిరం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ ఎస్‌ఎం పురం క్యాంపస్‌లో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జెమ్స్, కమలా ఆస్పత్రికి చెందిన వైద్య బృందాలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. 800 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

నదిలో గల్లంతై.. సముద్రంలో మృతదేహంలా తేలి..



అప్పారావు (ఫైల్)



సముద్ర తీరంలో అప్పారావు మృతదేహం

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ గ్రామంలోని నాగావళి నదిలో దుస్తులు ఉతికే రాతి బల్లను బయటకు తీసే క్రమంలో బుధవారం కొట్టుకుపోయిన అంపోలు అప్పారావు (50) శ్రీకాకుళం రూరల్ మండలం గనగళ్లపేట సముద్ర తీరానికి విగతజీవిగా మారి కొట్టుకు వచ్చాడు. అప్పారావు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎచ్చెర్ల పోలీసులు గురువారం అదృశ్యం కేసు నమోదు చేశారు. నదిలో గాలించినా ఎలాంటి ప్రయోజనం లేకపోయింది. నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో నీటి ప్రవాహంతో పాటు సముద్రంలోకి మృతదేహం కొట్టుకు పోయింది. శ్రీకాకుళం రూరల్ మండలం గనగళ్లపేట బీచ్‌లో మృత దేహం కనిపించటంతో పోలీసులు సమీప ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. అప్పారావు కుటుంబ సభ్యులు మృతదేహాన్ని గుర్తించారు. భార్య, కుమారుడు ఎర్రయ్య ఉన్నారు. కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌కి బెదిరింపులు

ఇచ్ఛాపురం: మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్-2 లాబాల స్వర్ణమణిని కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు బెదిరిస్తున్నట్లు సమాచారం. బుధవారం రాత్రి వైస్ చైర్‌పర్సన్ కారు వెనుక వైఎస్సార్‌సీపీ జెండా రంగుల్లో రాసి ఉన్న లాబాల అనే పేరుపై నల్లని రంగు పూశారని, ఇంటి ముందున్న వినాయకుని బొమ్మపై కూడా నలుపు రంగుని పూసి ఇంటి గోడపై మృత, ఎక్స్ అనే అక్షరాలను నల్లని రంగులో రాసి బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు.

ఇంటి ఎదురుగా ఉన్న టాక్సీ స్టాండ్ నిర్మాణ విషయంలో తనతో కొంతమంది డ్రైవర్లు ఘర్షణకు దిగారని, వాళ్లే ఈ బెదిరింపులకు పాల్పడి ఉంటారనే అనుమానంతో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఐ ఎం.చిన్నంనాయుడు, ఎస్‌ఐ చిన్నంనాయుడు ఇద్దరు గురువారం వచ్చి దర్యాప్తు చేసినట్లు పేర్కొన్నారు.



ఆ బొమ్మలే అమ్మలై..



ఆ బొమ్మలే అమ్మలుగా మారి వారికి తిండి పెడుతున్నాయి. ఆ మూర్తులే ఆప్తుల్లా ఆదుకుంటున్నాయి. వినాయక చవితి అంటే అందరికీ మండపం, విగ్రహం, సరదా, సంబరం. కానీ వారికి మాత్రం పని, కూలి, ఉపాధి. ఏడాదికోసారి వచ్చే ఈ పండగతో కుటుంబ పోషణకు కావాల్సినంత డబ్బు సంపాదించడానికి విగ్రహ తయారీ దారులు తెగ కష్టపడుతుంటారు. తమ కళతో ఇంటి కలలు నెరవేరుస్తుంటారు. వీరితో పాటు అర్చక పూజారులు, టెంట్ నిర్వాహకులు, పూజా సామగ్రి విక్రయదారులు, నాటక కళాకారులు, భోజనాల తయారీదారులకు కూడా ఈ ఉత్సవం ఉపాధి చూపిస్తుంది.

- గణపయ్య విగ్రహాల తయారీతో పలు కుటుంబాలకు పోషణ
- అనేక రంగాల కార్మికులకు ఉపాధి
- నవరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం

ఎల్‌ఎన్ పేట: వినాయక చవితికి ఆరు నెలల ముందే విగ్రహాల తయారీ మొదలైపోతుంది. జిల్లాలోని రణస్థలం, పైడి భీమవరం, ఎచ్చెర్ల, సుభద్రాపురం, చిలకపాలెం, లావేరు, జి.సిగడాం, పొందూరు, కొత్తరోడ్డు, రాగోలు, ఆమదాలవలస, సరుబుజ్జిలి, మల్లికార్జునపురం, శ్యామలాపురం, హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి, టెక్కలి, నరసన్నపేట, పలాస, బుడితి, చల్లవానిపేట, జలుమూరు, సింగుపురం, పెద్దపాడు, నందిగాం, మందస, ఇచ్ఛాపురం వంటి అనేక ప్రాంతాల్లో వినాయక బొమ్మలు తయా రు చేస్తున్నారు. రాజస్థాన్ నుంచి కళాకారులను తీసుకునివచ్చి బొమ్మలు చేయిస్తున్నారు.

ఎందరికో ఉపాధి

వినాయక మండపాలు తయారు చేసే కూలీలు, టెంట్ నిర్వాహకులు, బొమ్మలు తరలించే ఆటో, లగేజీ వ్యాన్లు, ట్రాక్టర్ల యజమానులు, పూజాధికాలు విక్రయించే వ్యాపారులు, పత్రి, పూలు, పళ్లు విక్రయించేవారు, విద్యుత్ లైట్ సెట్టింగ్స్, డీజే సౌండ్స్, టెంట్స్ నిర్వహణ, నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి రోజు పూజలు చేసే పురోహితులు, నవరాత్రి సందర్భంగా వీధివీధిలోను వినాయక ప్రసాదం పేరుతో ఏర్పాటు చేసే విందు భోజనాలకు వంటలు చేసేవారు ఎంతో మంది ఉపాధి పొందుతారు.

నాటకాలు, బుర్రకథలు

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వీధివీధుల్లోను నాటకాలు, బుర్రకథలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎక్కువగా ప్రదర్శిస్తుంటారు. ఎన్నో నెలలుగా ప్రదర్శనలు లేక అంతరించిపోతుందన్న నిరుత్సాహంలో ఉన్న కళాకారులకు ఉపాధి దొరకుతుంది. ఏడాదంతా ఖాళీగా ఉన్న కళాకారులు వారిలో దాగిఉన్న ప్రతిభను పదును పెడతారు. నృత్యాలు, మిమిక్రీలు, మ్యాజిక్ షో, ఆర్కెస్ట్రా, సన్నాయి వాయిద్యాలు, డ్రమ్స్, సింగర్స్‌లకు చేతినిండా పని లభిస్తుంది. వినాయక నవరాత్రి వేడుకల్లో పురోహితులకు, అర్చకులకు చేతినిండా పని ఉంటుంది. వీధివీధినా విగ్రహాలు వెలుస్తాయి.

పన్నెండేళ్లుగా మా కుటుంబానికి ఉపాధి



గత పన్నెండేళ్లుగా మా భార్యాభర్తలం ఇద్దరు వినాయక బొమ్మలు తయారు చేసి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నాం. బొమ్మల తయారీ కోసం మట్టితో ఇతర సామగ్రిని సమకూర్చుకుంటాం. బొమ్మలు మేమే తయారు చేస్తాం. రంగులు వేసేందుకు, కళ్లు, కిరీటాలు, మంచి ఆకృతులు తీర్చి దిద్దేందుకు రోజువారీ కూలీ పద్ధతిలో రాజస్థానీలను తీసుకువస్తాం.

– ఎస్ సూర్యనారాయణ, రమాకుమారి, బొమ్మల తయారీదారులు, మల్లిఖార్జునపురం, ఎల్.ఎన్.పేట